క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: పామూరులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ దృష్ట్యా శుక్రవారం సబ్‌స్టేషన్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

మా చెల్లి ఆచూకీ చూపించండయ్యా..

పీసీపల్లి: మా చెల్లి ఆచూకీ చూపించండయ్యా వెంగళాపురం గ్రామానికి చెందిన గుర్రం బ్రహ్మయ్య, పేరయ్యలు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..వెంగళాపురానికి చెందిన నోసిన చెంచమ్మ(35) గత నెల 11 నుంచి కనిపించడం లేదు. దీంతో ఆమె సోదరులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదులో చెంచమ్మ భర్త శ్రీను, మామయ్య నారాయణలపై అనుమానం వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ఎటువంటి విచారణ చేయకుండా కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. పోలీసులు స్పందించి చెంచమ్మ ఆచూకీ తెలుసుకోవాలని కోరుతున్నారు.

నేడు ఊళ్లపాలెంలో కోదండ రామ కళ్యాణోత్సవం



ఊళ్లపాలెంలోని కోదండరామస్వామి ఆలయం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెంలో కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ కేవీ ప్రసాద్ తెలిపారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఉభయదాతలుగా ప్రముఖ వ్యాపారవేత్త పులగర నారాయణరావు, చంద్రకళ దంపతులు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఒంగోలు ఏసీ కార్యాలయ అధికారి శ్యాంసుందర్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీసు శాఖను కోరినట్లు తెలిపారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొండపి(సింగరాయకొండ): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు సూచించారు. వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులతో నీతి కథల పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ వేయించడంతోపాటు యోగా నేర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ



కూలీల మస్టర్ పరిశీలిస్తున్న ఏపీఓ మాచర్ల

పొన్నలూరు: మండంలోని బోగనంపాడు పంచాయతీ పరుచూరివారిపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులను ఏపీఓ మాచర్ల గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల పనితనం, మస్టర్ రోల్‌ను పరిశీలించారు. ఉదయం పూట పనిచేయడం కుదరని కూలీలు, మధ్యాహ్నం తరువాత అయినా ఉపాధి పనులకు వెళ్లవచ్చని చెప్పారు. మస్టర్ రోల్‌లో అవకతవకలు చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

టీబీ రాకుండా టీకా వేయించుకోవాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియంవద

ఉలవపాడు: టీబీ రాకుండా ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రియంవద అన్నారు. మండల పరిధిలో మన్నేటికోట, ఆత్మకూరు, కరేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. టీబీ వ్యాధి రాకుండా ముందస్తుగా ఈ టీకా వేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కలిగినటువంటి వారు 16 ఏండ్ల దాటిన వారు అందరూ ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. టీకా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి గురువారం ఈ టీకా వేస్తామన్నారు. అనంతరం కరేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి రమ్యజ్యోతి, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొండవాగుల ఆక్రమణదారులపై చర్యలు



వాగు ఆక్రమణలను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని నాగులచెరువుకు సంబంధించిన కొండపై నుంచి వచ్చే నీటి ప్రవాహిక వాగులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. నాగులచెరువు పరివాహక ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధానంగా నీటి వనరుగా ఉన్న నాగుల చెరువులోకి నీరు చేరకుండా, క్వారీ యజమానులు, గ్రానైట్ కంపెనీలు, రియల్టర్ వ్యాపారులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. వ్యాపారులు తమ స్వార్థం కోసం కొండవాగు నీటిని నాగుల చెరువులోకి చేరకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దీని ప్రభావంతో చెరువులో నీరు లేక పట్టణంలోని భూగర్భ జలాలన్నీ ఎండిపోతున్నాయన్నారు. వర్షాలు కురిసినప్పుడు నీరు చెరువులోకి చేరితేనే పట్టణంలోని బోర్లల్లో, బావుల్లో నీరు సంవృద్ధిగా ఏడాది పాటు ఉంటాయని తెలిపారు. కొండవాగు నీరు రాకుండా అడ్డుకోవడం వల్లే పట్టణానికి నీటి ముప్పు ఏర్పడిందన్నారు. అక్రమణదారులు తక్షణం కొండవాగు ప్రాంతాల్లోని కట్టడాలను, ఆక్రమణలను, క్వారీ రాళ్లను తొలగించాలన్నారు. లేకుంటే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి పూర్తి స్థాయి ప్రక్షాళన చర్యలు చేపడతానని చైర్మన్ గఫార్ హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పెన్నా ఏడుకొండలు, పసుపులేటి అరుణోధర్, కంటు గరవయ్య, చిన్నిగారి కొండలు, ఎస్‌కే మన్సూర్ తదితరులున్నారు.

నేటి నుంచి గంగ తిరునాళ్ల



తిరునాళ్లకు సిద్ధం చేసిన ఆలయం



ఆలయంలోని మూల విరాట్ గంగమ్మ తల్లి



పాలేటి నదిపై వెలసిన అమ్మవారు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం పాలేటి గంగ ఒడ్డున వెలసిన గంగమ్మ తిరునాళ్ల శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల అనుమతి లేదన్నారు. జిల్లాలో గంగ తిరునాళ్లకు మంచి గుర్తింపు ఉంది. అమ్మవారు ఎంతో మహిళకలది కావడంతో తిరునాళ్లలో మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సేంద్రియ, జీవన ఎరువులు వేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ అనసూయ

కందుకూరు: భూసార పరిరక్షణ కోసం రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు పి.అనసూయ అన్నారు. మండలంలోని విక్కిరాలపేట, కొండికందుకూరు గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరిరక్షణకు, నాణ్యమైన దిగుబడులు పొందేందుకు, సమగ్ర పోషక యాజమాన్యం కోసం సేంద్రియ, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల పంటల సాగు చేపట్టాలని సూచించారు. దీని వల్ల భూమి సారవంతం అవ్వడమే కాకుండా, భూమి భౌతిక, రసాయనిక స్వరూపం మారి గుళ్లబారి నీటిని పీల్చుకునే స్వభావం పెరుగుతుందని సూచించారు. అలాగే భూమిలో కర్బన శాతం పెరిగిన సమతుల్యమైన పోషకాలు మొక్కకు అందిమంచి దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుందని వివరించారు. వ్యవసాయాధికారి వి.రాము మాట్లాడుతూ కొత్త రకం ఎరువులైన నానో యూరియా, నానో డీఏపీ ఎరువులపై పాటుగా పంటలకు పిచికారీ చేసేందుకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటి వల్ల భూమి కాలుష్యం, రైతు ఖర్చును తగ్గించి మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించేందుకు ఆర్బీకే కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని, రైతులు సంబంధిత ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విక్కిరాలపేట, కొండికందుకూరు గ్రామ వ్యవసాయ సహాయకులు డి.రోషిణి, కె.చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు



ఉలవపాడు గ్రంథాలయంలో స్కిప్పింగ్ పోటీలు

ఉలవపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని బయటకు తీసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు తెలిపారు. ముందుగా విద్యార్థులతో నీతికథలు, జాతీయనాయకుల జీవితచరిత్రలు చదివించారు. ఇప్పటి వరకు జరిగిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ భవన దాత సుచరితారెడ్డి గ్రంథాలయాన్ని సందర్శించి బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు.

బుద్ధుని మార్గం అనుసరణీయం



బుద్ధుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

కందుకూరు: బుద్ధుని బోధనలు మానవాళికి అనుసరణీయమని జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిశోర్ అన్నారు. ధమ్మ చక్ర ఫౌండేషన్ నేతృత్వంలో స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం భాగంగా గురువారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాంతి, సమానత్వం, సౌభ్రాతత్వంతో మానవాళి జీవించాలని బౌద్ధం బోధించిందన్నారు. ప్రపంచంలో వివక్షతలు, యుద్ధాలు అంతరించడానికి బుద్ధుని మార్గాన్ని అనుసరించాలని సూచించారు. బౌద్ధ ఉపాసకుడు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ త్రిశరణ-పంచశీల పఠనంతో బుద్ధునికి నివాళి అర్పించారు. త్రిశరణ, పంచశీల ఆవశ్యత గురించి వివరిస్తూ మనస్సు ప్రధాన కేంద్రంగా ప్రపంచంలో ప్రతి మనిషిలో దుఖం ఉందని, ఆ దుఖం నివారణకు మార్గం పంచశీల, అష్టాంగ రూపంలో ఉందని వివరించారు. గ్రంథపాలకురాలు పి. నాగరజని మాట్లాడుతూ విద్యార్థి, యువజనులకు సామాజిక పరిజ్ఞానాన్ని అందించగలిగేది గ్రంథాలయాలు మాత్రమేనని, గ్రంథాలయాలను ఉపయోగించుకునే విధంగా వీరిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. బుద్ధభగవాన్ స్ఫూర్తితో విద్యార్థులు, యువత గ్రంథ పఠనాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన బుద్ధ అండ్ హిస్ దమ్మా అనే గ్రంథాన్ని గ్రంథాలయ కాపీగా గ్రంథపాలకురాలు నాగరజనికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఏవీఆర్ మూర్తి, పగడాల రోశయ్య, షేక్ ఖాదర్‌భాష, చిల్లర సుబ్బారావు, ఎస్‌కె సలోవర్, ముతకాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావు

కందుకూరు: తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కాలేజీ పౌరశాస్త్ర అధ్యాపకుడు ఓరుగంటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంకటేశ్వరరావు గురువారం కాలేజీలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత ప్రమాణాలకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. టీఆర్ఆర్ జూనియర్ కాలేజీని ఉత్తమ కాలేజీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. కాలేజీ అధ్యాపకులు తొట్టెంపూడి సుబ్బారావు, మస్తాన్‌వలి, పరుచూరి ఉష, మాధవి, లక్ష్మీ, చుండూరి బాబూరావు, కలగట్ల హజరత్తయ్య, కట్టా సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ అక్రమ్ తదితరులు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

వెంకటరెడ్డికి ఘన నివాళి



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ కాంట్రాక్టర్ మునగల వెంకటరెడ్డి(74) అజాత శత్రువు అని జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన మునగల వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈసందర్భంగా గురువారం మోపాడులోని వారి నివాసంలో ఏర్పాటుచేసిన సంతాపసభలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి రాజకీయ మిత్రుని కోల్పోయామని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, ఎంజీ .రాధాకృష్ణమూర్తి, మిరియం రామారావు, కుందురు మాల్యాద్రిరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ ఈశ్వరమ్మ మృతి

కనిగిరి రూరల్: మాజీ జెడ్పీటీసీ అంకాళమ్మ తల్లి గుడి శాశ్వత ధర్మకర్త భూతలపల్లి ఈశ్వరమ్మ(70) గురువారం మృతి చెందారు. ఆమె గత నాల్గు రోజులుగా అనారోగ్యంతో చికిత్సపొందుతూ మృతి చెందారు. ఈశ్వర్మ భౌతిక కాయాన్ని పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు స్థానిక పాతూరులోని స్వగృహంలో సందర్శించి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, భూతలపల్లి మాలకొండారెడ్డి, సానికొమ్ము రంగనాయకుల రెడ్డి, న్యాయవాది మాచవరపు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్‌రెడ్డి, చొప్పరపు శ్రీనివాసులు, చిట్టిబత్తుని మధు, ఇనుకొల్లు వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు దాసరి మురళీ, సయ్యద్ రిజ్వానా ఖాలక్, పులి శ్రీనివాసులరెడ్డి, లోకిరెడ్డి అంకిరెడ్డి, విజయ్, సంగు కృష్ణారెడ్డి, సాయిబాబా దేవస్థానం కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణం, మదర్ థెరిస్సా సేవాసమితి అధ్యక్షుడు ఎస్ఎస్ రసూల్, కేతినేని పెద్దన్న, సగిలి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు



గజోత్సవంపై ఊరేగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి

వైభవంగా గజోత్సవం



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామ సమీపంలోని నాగులేటి ఒడ్డున వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గజోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చి అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముసలంపల్లి, వేములపాడు చెక్కా వారి వంశస్తులతో గజోత్సవం వైభవంగా సాగింది. అంకాలమ్మతల్లి, పోతురాజు స్వాముల వారి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రత్యేక కంప కల్లి, వసంతోత్సవ, అశ్వ వాహనం కనులపండువగా సాగింది.

రేపటి నుంచి కోదండరామస్వామి తిరునాళ్ల





కోదండరామస్వామి మూల విగ్రహమూర్తులు   తిరునాళ్లకు ముస్తాబైన కోదండరామస్వామి ఆలయం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేటలో శనివారం నుంచి 3 రోజులపాటు కోదండరామస్వామి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం తెలిపింది. శనివారం గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, స్నపనతిరుమంజ సేవ, అంకురార్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం స్వామి శాంతి కల్యాణోత్సవం, గ్రామోత్సవం, సోమవారం ఉదయం వసంతోత్సవం, వనమహోత్సవం, సాయంత్రం పారువేట, ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుడు



వేణుగోపాలునికి మోహినీ ఉత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

ఉలవపాడు: రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలుడు గరుడ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం తెల్లవారుఝామున ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసిన తరువాత గరుడ వాహనంపై గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య గరుడ సేవ ఎంతో వైభవోపేతంగా సాగింది. ఆలయ ముఖద్వారంలో భక్తుల కోసం స్వామిని ఉంచారు. బుధవారం అర్ధరాత్ర మోహినీ ఉత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం కల్యాణం, రథోత్సవం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలియచేశారు.

కరువు మండలంగా వెలిగండ్ల



మాట్లాడుతున్న ఏడీఏ ఈవీ రమణ

వెలిగండ్ల: రబీ 2023–24లో వర్షపాతం తక్కువగా ఉన్నందున ప్రభుత్వం కరువు మండలంగా వెలిగండ్లను ఎంపిక చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ ఈవీ రమణ తెలిపారు. మండలంలోని హుస్సేన్‌పురం ఆర్‌బీకెలో వ్యవసాయ శాఖ సచివాలయ ఉద్యోగులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడతూ పంట నష్టపోయిన రైతులు వివరాలు, ఆధార్, బ్యాంక్ వివరాలు జాగ్రత్తగా నమోదు చేసి, పూర్తయిన జాబితాను ఆర్‌బీకేల్లో సామాజిక తనిఖీల నిమిత్తం ప్రదర్శన చేయాలని తెలిపారు. రబీ సీజన్‌లో ఈ క్రాప్ చేసుకున్న పంటలను మాత్రమే నమోదు చేయాలని వ్యవసాయ సిబ్బందికి తెలిపారు. రైతులు కూడా తమ గ్రామ వీఏఏలకు సహకరించి సరైన ధ్రువపత్రాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎస్ రంగా కృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



సింగరాయకొండలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథ్



కె.అగ్రహారంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ పాండురంగారావు

సింగరాయకొండ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఎవరైనా అల్లర్లు సృష్టించినా, కౌంటింగ్ రోజు రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని సీఐ దాచేపల్లి రంగనాథ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో బుధవారం సాయంత్రం ఎన్నికల నియమావళిపై సీఐ అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమిస్తే రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ప్రజలంతా సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు సర్కిల్ పరిధిలోని సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. టంగుటూరు ఎస్సై పున్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు బైకులు సీజ్

మండలంలోని బాలయోగినగర్‌లో గురువారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించి ఆరు బైకులు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో టంగుటూరు ఎస్సై పున్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.అగ్రహారం 26 వాహనాలు సీజ్

పొన్నలూరు: మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో కొండపి సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 26 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన ఎన్నికల లెక్కింపు దృష్ట్యా గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దన్నారు. గొడవలకు పాల్పడితే కేసులతో పాటు రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకట రాజేష్, కొండపి ఎస్సై కృష్ణబాజీరావు, పోలీసులు పాల్గొన్నారు.